'గాంధీ' ఆపరేషన్ షురూ..!

- ఆస్పత్రిలో దిద్దుబాటు చర్యలు మొదలు
- ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఉన్నతాధికారులు
- అన్ని విభాగాలను మరింత బలోపేతం చేస్తాం : డీఎంఈ నరేంద్రకుమార్

గాంధీ ఆస్పత్రి.. ఈ పేరు వింటే పేదోడికి అదో ధైర్యం..అక్కడికి వెళితే కచ్చితంగా వ్యాధి నయమవుతుందనే భరోసా.. అయితే గాంధీలో ఇటీవల వ్యవస్థ అస్తవ్యస్తమైంది.. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిర్వహించిన తనిఖీల్లోనే ఇది బట్టబయలైంది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.



గాంధీ పాలనాధికారులకు సూచనలు ఇస్తున్న డీఎంఈ నరేంద్రకుమార్

గాంధీఆస్పత్రి : గాంధీఆస్పత్రిలో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు, పరిపాలన వ్యవస్థలను మరింత మెరుగుపర్చేందుకు వైద్య ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల గాంధీ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, ఆస్పత్రి పాలన వ్యవస్థ డొల్లతనం బయటపడడంతో తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరక్టర్ (డీఎంఈ) డాక్టర్ నరేంద్రకుమార్ శుక్రవారం గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలలో తనిఖీలు నిర్వహించారు.ఓపీ, అత్యవసర, రేడియాలజీ విభాగాలను సందర్శించి పలు సలహాలు, సూచనలు చేశారు.

- పలు అభివృద్ధి, నిర్మాణ పనులు కొనసాగుతున్న క్రమంలో ఆస్పత్రి ప్రాంగణంలో మురుగునీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలన్నారు.
- ఎండలు ముదరుతున్న నేపథ్యంలో రోగులు, రోగిసహాయకులు, సందర్శకులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
- ఇన్, అవుట్ పేషెంట్ భవనాల కారిడార్లలో చీకటిగా ఉన్న కొన్ని ప్రాంతాలను గుర్తించి లైట్లు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి, కాలేజీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు.
- డ్రగ్స్, డైట్, పారిశుధ్యం, పేషెంట్ కేర్ తదితర విభాగాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు.
- గాంధీ సంతాన సాఫల్య కేంద్రంలో ఐయుఐ పద్ధతిలో వైద్యసేవలు అందిస్తున్నామని, ఐవీఎఫ్ సేవలు త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు.

తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంపొందించేలా..

తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా, గాంధీ, కాకతీయ ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల బ్రాండ్‌ఇమేజ్‌ను మరింత పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ వివరించారు. రాష్ట్రంలో 15 మేజర్ ప్రభుత్వ ఆస్పత్రులున్నాయని, వీటిలో మౌళిక వసతులు, నిరుపేదలకు మేలైన సదుపాయాలు, వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

27 మంది గైర్హాజర్.. 15 మందికి షోకాజ్ నోటీసులు...

వైద్యమంత్రి దామోదర రాజనర్సింహా ఆకస్మిక తనిఖీలకు వచ్చినప్పుడు 27 మంది వైద్యులు గైర్హాజర్ అయినట్లు గుర్తించామని, వీరిలో 15 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు డీఎంఈ స్పష్టం చేశారు. సమగ్ర విచారణ అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజ కుమారి, ఆర్ఎంఓ-1 శేషాద్రి, ఆర్ఎంఓలు యోగేందర్, కళ్యాణచక్రవర్తి, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌గౌడ్, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జన ఔషధి దివస్ వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

రసూల్‌పురా: వేలాది రూపాయలు ఖర్చుచేసి మందులు కొనలేని పరిస్థితిలో ఉన్న ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోదీ జన ఔషధి పరియోజన స్కీంలో జన ఔషధి కేంద్రాల ద్వారా జనరిక్ మందులను అందజేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జన ఔషధి దివస్ ఏడో వార్షికోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరిలో జన ఔషధి కేంద్రాల నిర్వాహకులు గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమానికి ఈటల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా కాకుండా దేశమంతా విస్తృతంగా కేంద్రాలు ఏర్పాటు చేసి బ్రాండెడ్ మందుల కంటే 50 నుంచి 90 శాతం తక్కువ ధరలకే మందులను అందజేస్తున్నారని చెప్పారు. డీఎంహెచ్‌వో వెంకట్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, కెప్టెన్ అవదేశ్ మిశ్రా, డీకే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం దక్కేలా కృషి

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల ఆస్తులు కోల్పోయే బాధితులకు తగిన న్యాయం దక్కేలా చూస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బోర్డు సభ్యురాలు భానుక నర్మదతో కలిసి శుక్రవారం ఎన్‌హెచ్-44 మార్గంలోని బోయిన్‌పల్లి చిన్నతోకట్టా, సంజీవయ్య నగర్ బస్తీల్లో పర్యటించారు. రోడ్డు విస్తరణ కారణంగా తొలగించే ఇళ్లను పరిశీలించారు. బాధితులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. విస్తరణ పనులు చేపట్టడానికి ముందే బాధితులకు మార్కెట్ రేటుకు అనుగుణంగా పరిహారం ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు.

ఆశా వర్కర్లకు సన్మానం



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రవీందర్‌గౌడ్

అమీర్‌పేట: బల్కంపేట శంకర నేత్రాలయం వద్ద మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శంకర నేత్రాలయం అధినేత, సరోజిని దేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డా.రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం అమీర్‌పేట ,సనత్‌నగర్, బేగంపేట ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది ఆశా వర్కర్లను సన్మానించారు.ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్న మహిళలకు ప్రభుత్వాలు, పౌరులు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో జెక్ కాలనీ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు డా.మల్లు ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ మహిళా పోలీసులకు సన్మానం



అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే మహిళా సిబ్బందిని సన్మానించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు సిబ్బందిని సన్మానించారు.

వినియోగదారుల హక్కుల సంస్థ కార్యవర్గం ఎన్నిక



అడ్డగుట్ట: వినియోగదారుల హక్కుల సంస్థ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు సంస్థ ఉపాధ్యక్షుడు తాండ్ర రమేష్ నేతృత్వంలో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనరల్ సెక్రటరీగా పోత్కంపల్లి మధుబాబు, జాయింట్ సెక్రటరీగా కుంపటి జగదీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అబ్దుల్ నసీర్‌లతో పాటు ఇతర సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రామగిరి హరిబాబు చేతుల మీదుగా నియామకపత్రాన్ని నూతన కమిటీ సభ్యులు అందుకున్నారు. సంస్థ ప్రతినిధులు శివకుమార్, దేవానంద్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మనది మాతృస్వామ్య దేశం : ఎంపీ ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్: భారతదేశంలో మాతృస్వామ్య దేశం ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలిగా భానుక నర్మదను కేంద్రం నియమించిన నేపథ్యంలో శుక్రవారం బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, డిప్యూటీ సీఈఓ పల్లవి విజయ్ వన్షీ, బోర్డు అధికారులు భానుక నర్మదకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. 2011లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షురాలిగా ఎన్నికై దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యక్షురాలిగా భానుక నర్మద చరిత్ర సృష్టించారని అన్నారు. ప్రస్తుతం తిరిగి సికింద్రాబాద్ కంటోన్మెంట్ తొలి నామినేటెడ్ సభ్యురాలిగా నియమితులయ్యారని అన్నారు. ఈ నేపథ్యంలోనే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఒక రోజు ముందే మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. బోర్డు సభ్యురాలు నర్మద మాట్లాడుతూ బోర్డు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కంటోన్మెంట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: నిరుపేద యువతుల వివాహాల కోసం కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఒక లక్షా నూట పదహారు రూపాయల ఆర్థికసహాయం అందజేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుమలగిరి లాల్‌బజార్ ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో అర్హులైన లబ్దిదారులకు 21 కళ్యాణలక్ష్మి, 10 షాదీ ముబారక్ పథకం కింద చెక్కులను శ్రీగణేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు లక్షా నూట పదహారు రూపాయలతో పాటు తులం బంగారం పథకం కూడ అందజేసేందుకు ప్రయత్నిస్తు న్నామని త్వరలో అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తిరుమలగిరి డిప్యూటీ తహసిల్దార్ హారిక, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు మురళి ముదిరాజ్, నాగినేని సరిత, భవాని, మేరి పాల్గొన్నారు.

పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సీతక్క



పరేడ్‌మైదానంలో మహిళా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

రసూల్‌పురా: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పరేడ్ మైదానంలో శనివారం జరిగే వేడుకల ఏర్పాట్లను శుక్రవారం మంత్రి సీతక్క పరిశీలించారు. మంత్రితోపాటు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, అడిషనల్ డైరక్టర్ జనరల్ మహేష్ భగవత్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవం సందర్భంగా సాయంత్రం ఆరు నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో 150 మందికి ఆర్టీసీ అద్దెబస్సులు అందజేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 55 వేల మంది మహిళలు పాల్గొంటున్నారన్నారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మేనేజింగ్ డైరక్టర్ ముషరఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఏఆర్‌కే హోమ్స్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటవ వరకు ఏఆర్‌కే హోమ్స్, రుక్మిణి ఎన్‌క్లేవ్, సుందరమ్మ కాలనీ, శాంతి నికేతన్ ఎన్‌క్లేవ్, రైల్వే కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నటుల్ సికింద్రాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మురళీ కృష్ణ తెలిపారు. అదేవిధంగా భూపతి రావు నగర్ 11 కేవీ ఫీడర్ పరిధి లోని భూపతి రావు నగర్,శక్తి గణేష్ నగర్, అల్వాల్ హిల్స్‌లో ఉదయం 11 నుంచి 11.30 వరకు, లక్ష్మీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో సుభాష్‌నగర్, ఆర్టీసీ కాలనీ, టీచర్స్ కాలనీ, గన్‌రాక్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు విద్యుత సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఐదో వార్డులో నీటి సమస్య తీర్చండి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఐదోవార్డు పరిధిలోని పలు బస్తీలు, కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాల్సిందిగా కాంగ్రెస్ నేత తేలకుంట సతీష్ గుప్తా, ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పలు ప్రాంతాల్లో నెల రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కంటోన్మెంట్ తాగునీటి విభాగం ఇంజనీర్ శశాంక్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా ఆయా ప్రాంతాల్లో కొన్ని రోజులుగా నీటి సరఫరాలో సమస్యలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తక్షణమే మరమ్మతు పనులు పూర్తి చేసి, తాగునీటి సరఫరాను యధావిధిగా పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కొన్ని బస్తీల్లో పబ్లిక్ బోర్ వెల్ ఎండిపోవడంతో బస్తీ వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని అందువల్ల గాంధీ నగర్ బస్తీ, కాకగూడ బస్తీ, సంజీవయ్య నగర్ బస్తీ లలో కొత్త బోర్ వెల్ వేయించాలని ఎమ్మెల్యేను సతీష్ గుప్తా కోరారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సైన్స్ నమూనాలు



సనత్‌నగర్: అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల (సనత్‌నగర్ ఓల్డ్)లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టింది. సుమారు 50 రకాల వైజ్ఞానిక నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. అయోధ్య రామాలయ వైభవాన్ని తెలియజేసిన నమూనా సందర్శకులను ఆకట్టుకుంది. న్యూటన్ మూడో గమన నియమాన్ని అనుసరించి రాకెట్ ప్రయోగించే విధానం, వేస్ట్ మెటీరియల్ నుంచి పవర్‌బ్యాంక్, మొబైల్ ఫోన్ ఉపయోగించి ఎక్కడి నుంచైనా ఆపరేట్ చేసే విధానం, నీటిని శుద్ధి చేసే పరికరం, నేలను దున్నే రోబో, అడ్డంకులను అధిగమించి ముందుకువెళ్లే రోబో తదితర అబ్బురపరిచే ఎగ్జిబిట్లను రూపొందించి ఔరా..అనిపించారు. ఈ సందర్భంగా పలువురు నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మార్త, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి స్థానిక సమస్యలు



లోప్రెషర్ సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య అన్నారు. శుక్రవారం ఆమె ఇంద్రలక్ష్మి నగర్, వెంకట్‌నగర్, గడ్డమీది బస్తీలలో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనేక ప్రాంతాల్లో తాగునీటి లోప్రెషర్ సమస్య అధికంగా ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లో ప్రెషర్ కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నేతలు శివలింగం, హంసరాజు, రాజేష్, బాబు, రాములమ్మ, కల్యాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో బొగ్గు రంగం కీలకపాత్ర

- ఐఐటీ హైదరాబాద్‌తో బొగ్గు గనుల శాఖ ఒప్పందం
- కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సమక్షంలో ఎంఓయూ



ఒప్పంద పత్రాలతో అధికారులు చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: దేశాభివృద్ధిలో బొగ్గు ఉత్పత్తి రంగం కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ కవాడిగూడ ప్రధాన రహదారిలోని సీజీఓ టవర్స్ పీఐబీలో కార్యాలయంలో శుక్రవారం ఐఐటీ హైదరాబాద్‌తో కోల్ ఇండియా లిమిటెడ్ మధ్య బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో ఖనిజాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఐఐటీ హైదరాబాద్ ఈ రంగంలో ఆత్యాధునిక పరిశోధనలు చేస్తోందన్నారు. పర్యావరణ హిత బొగ్గు ఇంధనం, ఉద్గారరహిత అత్యున్నత ప్రామాణిక సంస్థ క్లీన్ ను నెలకొల్పుతున్నట్లు ఐఐటీ హైద్రాబాద్ ప్రకటించింది. ఇందు కోసం రూ. 98కోట్ల ప్రారంభ గ్రాంటుతో కోల్ ఇండియా లిమిటెడ్ నిధులు సమకూర్చనుంది. కార్యక్రమంలో కోల్ ఇండియా లిమిటెడ్ సీఎండీ పి.ఎం. ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ శ్రీమూర్తి, ఎస్‌సీసీఎల్ సీఎండీ బలరామ్ నాయక్, పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ శ్రుతి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పీసీబీ కార్యాలయంలో మహిళా దినోత్సవం



సనత్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం సనత్‌నగర్‌లోని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు సమాజ అభ్యున్నతికి మహిళలు చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. వేడుకల్లో టెక్నికల్, సైంటిఫిక్, అడ్మినిస్ట్రేటివ్, అకౌంట్స్ విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

14 కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్

సికింద్రాబాద్ : ప్లాట్ ఫాంపై అనుమానస్పదంగా ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 14 కిలోల గంజాయి దొరికింది. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం జీఆర్పీ కార్యాలయంలో రైల్వే డీఎస్పీ జావేద్ వివరాలు వెల్లడించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా జీఆర్పీ పోలీసులు శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లోని ప్లాట్ ఫాం నంబర్ 10లో సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా రెండు బ్యాగులు కనిపించాయి. గమనించిన ఎస్ఐ రమేష్ వాటిని పరిశీలించగా సుమారు రూ. 7 లక్షల విలువగల 14 కిలోల గంజాయి కనిపించింది. వెంటనే బ్యాగులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 13, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 21, చామగడ్డ 55, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆలయ పాలక మండలి నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

బన్సీలాల్‌పేట్ : సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం పాలకమండలి సభ్యులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దేవాలయ అధికారిణి శ్రీదేవి నూతన పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. లక్ష్మీ, ఎల్లేష్, అశోక్, బాబు, సదానంద్‌లు పాలక మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ చైర్మెన్‌గా ఎల్లేష్‌ను ఎన్నుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు టి. మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పురుగులు,బూజు పట్టిన బియ్యంతో వంటకాలు

అమీర్‌పేట: అమీర్‌పేటలోని హోటల్స్‌లో ఆహార భద్రతా అధికారుల తనిఖీల్లో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అమోఘ, తాజా కిచెన్ హోటల్ వంట శాలలో ఆహార పదార్థాలు, వంట సిబ్బంది పరిశుభ్రత అధ్వాన్నంగా ఉన్నట్లు గుర్తించారు. పురుగులు, బూజు పట్టిన బియ్యాన్ని ఉపయోగించి వంటకాలు చేస్తున్నట్లు నిర్ధారించారు. రక్తపు మరకలు కలిగి ఉన్న కత్తులను గుర్తించి ఆశ్చర్యానికి గురయ్యారు. బాత్‌రూమ్ సమీపంలో కిచెన్ ఏర్పాటు చేయగా డోర్ కూడా సరిగా లేని కారణంగా కిచెన్‌లోకి దుర్వాసనలు వస్తున్నట్లు గుర్తించారు. కిచెన్ అస్తవ్యస్తంగా ఉందని, ప్లేట్స్,వంట పాత్రలు సరిగా శుభ్రపరచడం లేదని అధికారులు తెలిపారు. ఫ్రిజ్ పూర్తి అపరిశుభ్రంగా ఉండటంతో పాటు కిచెన్‌లో ఎక్కడ చూసినా వెంట్రుకలు పడి ఉన్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. తనిఖీలు చేస్తున్న సమయంలో హోటల్‌లోనే ఉన్న వినియోగదారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం కేసులో యువకుడి అరెస్ట్

అమీర్‌పేట: యువతి ఆత్మహత్యాయత్నం కేసులో పోలీసులు ఓ యువకుడిని అరెస్టు చేశారు. ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఎర్రమంజిల్‌లో ఉంటున్న నాగరాజు (30) స్థానికంగా ఉండే 30 ఏళ్ల యువతి రెండు సంవత్సరాలుగా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. కాగా నాగరాజు తల్లి దండ్రులు వేరే యువతితో పెళ్లి చేయాలని నిర్ణయించడంతో రాజు ప్రేమించిన యువతికి దూరంగా ఉంటూ వస్తున్నాడు. దీంతో మనస్థాపం చెందిన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హార్పిక్ తాగి అస్వస్థతకు గురైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపి బాధ్యుడైన నాగరాజును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డిప్యూటీ మేయర్ ఇఫ్తార్ విందు



లాలాపేట: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంలోని ముస్లింలకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి శుక్రవారం తన నివాసంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులతో మతసామరస్యం , శాంతి సందేశం వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.